సాయిబాబా ఆలయంలో శ్రీ సాయి సప్తాహ ఉత్సవాలు ప్రారంభం



పద్మారావునగర్‌: పద్మారావునగర్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో శ్రీ సాయిసప్తాహ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీ సాయి రుద్రసేవతో ఈ ఉత్సవాలు కన్నుల పండవగా ప్రారంభయ్యాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు డాక్టర్‌ సాయికుమార్‌, ఆశ్రమ కార్యదర్శి చలువరాయనంద విలేకరులతో చెప్పారు.

వ్యాధి నివారణకు మెరుగైన వైద్య సేవలు పొందాలి



సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం వహించకుండా అందుబాటులో ఉన్న వైద్య సేవలను పొందాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద బన్సీలాల్‌పేట డివిజన్‌ సీసీనగర్‌కు చెందిన దశరథ్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. లక్ష ఆర్థిక సహాయం మంజూరు పత్రాన్ని (ఎల్‌ఓసీ) సోమవారం ఆయన అందజేశారు. దశరథ్‌ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయలు మంజూరయ్యాయి.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న లిల్లీ మోడల్‌ స్కూల్‌ కరస్పాండెంట్‌

అడ్డగుట్ట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లిల్లీ మోడల్‌ స్కూల్‌ కరస్పాండెంట్‌ అజ్రా రజియుద్దీన్‌ అన్నారు. సోమవారం నార్త్‌లాలాగూడలోని లిల్లీ మోడల్‌ స్కూల్‌, జీహెచ్‌ఎంసీ మెడికల్‌ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్‌ కరస్పాండెంట్‌ రజియుద్దీన్‌ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశముంటుందని, అందువల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షుడు ఖాయుముద్దీన్‌, సయీద్‌ అహ్మద్‌, షేక్‌ మతీన్‌, స్కూల్‌ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఎన్‌ నగర్‌లో కార్పొరేటర్‌ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ కంది శైలజ

బౌద్ధనగర్‌: వారాసిగూడలోని ఎల్‌ఎన్‌ నగర్‌లో సోమవారం కార్పొరేటర్‌ కంది శైలజ పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఎల్‌ఎన్‌ నగర్‌లో ఒక ఇంటి గోడ కూలింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్‌ కంది శైలజ సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో వెళ్లి ఘటనా స్థలిని పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా పాత గోడ కులిందన్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని కార్పొరేటర్‌ కంది శైలజ చెప్పారు. ఆ తరువాత డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తార్నాక చౌరస్తాలో ఛిద్రమైన రహదారి



లాలాపేట: తార్నాక చౌరస్తాలోని ప్రధాన రహదారిలో ఓయూ క్యాంపస్‌ నుంచి సికింద్రాబాద్‌ వైపు వెళ్లే మార్గంలో మూల మలుపు వద్ద రోడ్డంతా ఛిద్రమైంది. 15 రోజు క్రితం ఇక్కడ వాటర్‌ పైపు లీకేజితో గుంత ఏర్పండింది. ఇటీవల కురిసిన వర్షానికి, వాహనాల రాకపోకల తాకిడికి ఈ ప్రాంతంలోని రోడ్డంతా గుంతలమయంగా మారింది. లోతుగా ఏర్పడి గుంతలతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. రాత్రి వేళలలో ఈ ప్రాంతంలో మరింత ప్రమాదం పొంచి ఉంది. కావునా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మరమతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్‌

బౌద్ధనగర్‌: ప్రతీ శుక్రవారాన్ని డ్రై డేగా నిర్వహించాలని కార్పొరేటర్‌ కంది శైలజ సూచించారు. పార్శీగుట్టలోని మదర్‌ మేరీ స్కూల్‌లో సోమవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తమ ఇళ్లు, స్కూళ్లు, ఆఫీసుల్లోని నీటి నిల్వలు ఉన్నటువంటి వస్తువులను శుభ్రం చేసుకోవాలన్నారు. వారంలో ఒకరోజు పరిశుభ్రత కోసం కేటాయించాలని, తద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. స్కూల్‌ ప్రిన్సిపల్‌ కిరణ్‌, డాక్టర్‌ ఎలిజబెత్‌, ఆశా వర్కర్లు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన దారులు







- సీతాఫల్‌మండిలో దెబ్బతిన్న రోడ్లు
- పట్టించుకోని పాలకులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌లో బండిమీద వెళ్లాలంటే ఒళ్లంతా కళ్లు చేసుకోవాలి. లేకపోతే అంతే..! డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న అంతర్గత రోడ్లు స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఎక్కడికక్కడ దెబ్బతిన్న రోడ్లపై వెళ్లాలంటే బిక్కు బిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. ఆదమరిస్తే.. అంతే.. కిందపడి ఆస్పత్రుల పాలుకావాల్సిందే. ఆ రోడ్లపై ఏదైనా అత్యవసర పనినిమిత్తం వెళ్లేటపుడు, పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లేటపుడు భయమేస్తుందని స్థానికులు వాపోతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. మరమ్మత్తులు చేపట్టాలని విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- శ్రీనివాసనగర్‌, ఫ్రైడేమార్కెట్‌, వెంకటేశ్వరనగర్‌, మార్కండేయ నగర్‌, మైలార్‌గడ్డ, నామాలగుండు, ఇందిరానగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి.
- పార్లమెంట్‌ ఎన్నికలకు ముందు ఆయా ప్రాంతాల్లో నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా ఎన్నికల కోడ్‌ వచ్చేనాటికి టెండరు ప్రక్రియ పూర్తికాకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టలేదు.
- ఎన్నికలు కోడ్‌ ముగిసేనాటికి ఆయా నిధులు మురిగిపోయాయి. నూతనంగా మరోమారు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఆమోదం పొందలేదు. దీంతో గత ఏడాదిగా ఆయా ప్రాంత ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు.
- బోనాల జాతరను దృష్టిలో పెట్టుకుని సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి అంతర్గత రహదారులకు మోక్షం కలిగేలా చర్చలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరామ్మ రాజ్యమంటే విద్యార్థుల అరెస్టులా?



హాస్టల్‌ నుంచి విజయ్‌ నాయక్‌ను అరెస్ట్‌ చేస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇందిరమ్మ రాజ్యామంటే హక్కుల కోసం పోరాడే విద్యార్థులను అరెస్టు చేయడమా ? అని బీఆర్‌ఎస్‌ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చటారి దశరథ్‌ సోమవారం సీఎం రేవంత్‌ రెడ్డిని ప్రశ్నించారు. ఓయూలో విద్యార్థుల హాస్టల్‌ గదుల్లోకి చొరబడి బలవంతగా అరెస్టులు చేస్తుంటే కాంగ్రెస్‌ మంత్రులు, ప్రజా ప్రతినిధులకు ఇవి కనిపించడం లేదా అన్నారు. ఉద్యోగాల పెంపు, పరీక్ష వాయిదా కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను, విద్యార్థులను శాంతిభద్రతల పేరుతో గత వారం నుంచి క్రిమినల్స్‌గా అరెస్ట్‌ చేయడం దారుణమన్నారు. నిరుద్యోగుల ఎన్నికల ప్రచారం, సానుభూతి ఓట్లతో గెలిచిన కాంగ్రెస్‌ నాయకులు ఇంత జరుగుతున్న మౌనం వహించడం తగదన్నారు. ఇదిలా ఉండగా సచివాలయం ముట్టడి సందర్బంగా ఓయూలోని బీఆర్‌ఎస్వీ నాయకులు తుంగా బాలు, కె.జంగయ్య, రమేష్‌గౌడ్‌, మిథున్‌, తెలంగాణ డెమొక్రటిక్‌ స్టూడెంట్‌ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌ నాయక్‌తో పాటు 13 మంది విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్ట్‌ చేసినట్లు ఓయూ సీఐ రాజేందర్‌ తెలిపారు.

ముగిసిన సీపీఎం బస్తీబాట



బస్తీబాట ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్తీ బాట కార్యక్రమం సోమవారం ముగిసింది. నగరంలో పేదలకు గృహాలు, విద్యుత్‌, తాగునీరు తదితర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 6న సీపీఎం నాయకులు బస్తీ బాట కార్యక్రమాలు ప్రారంభించారు. తుకారాంగేట్‌లో మొదటైన బస్తీబాట కార్యక్రమాలు సీతాఫల్‌మండి డివిజన్‌ చిలకలగూడ కూడలిలో ముగించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. నగరంలో అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందించాలని, పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. మహిళా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. సీపీఎం సికింద్రాబాద్‌ జోన్‌ ఇన్‌చార్జి అజయ్‌బాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేశ్‌, మధు, సూర్యప్రకాశ్‌, ఎల్లస్వామి, నరసింహా, సత్యనారాయణ, బాషా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు

- మహంకాళి జాతరపై అధికారుల సుదీర్ఘ సమావేశం
- ఈ సారి 7 క్యూలైన్లు
- ఐదు గంటల పాటు చర్చించిన అధికారులు

రాంగోపాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతరపై సోమవారం సాయంత్రం ప్రభుత్వ అధికారులు సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ నెల 21, 22 తేదీలలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు, రంగం కార్యక్రమం జరుగనుంది. అయితే లక్షల మంది భక్తులు పాల్గొనే ఈ జాతరలో ఎలాంటి ఇబ్బందులతో పాటు శాంతిభద్రతల సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు.

- దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌, కమిషనర్‌ హన్మంతరావు, హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి, నగర పోలీస్‌ కమిషనర్‌ శ్రీనివాసరెడ్డి, అదనపు కమిషనర్లు, మాన్‌సింగ్‌, విశ్వప్రసాద్‌ (ట్రాఫిక్‌), ట్రాఫిక్‌ డీసీపీ రాహుల్‌ హెగ్డె, ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్‌, జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌, డీసీ సమ్మయ్య, జలమండలి డైరెక్టర్‌ విజయరావు, జీఎం వినోద్‌కుమార్‌, ఈవో మనోహర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.
- ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు.
- గత ఏడాది 5 క్యూ లైన్లు ఉండగా ఈ ఏడాది వీఐపీల కోసం దేవాలయం వెనుక వైపు ప్రత్యేక క్యూలైన్‌ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు.
- వీవీఐపీలు వచ్చే సమయంలో ఒక వాహనం మాత్రమే పాత రాంగోపాల్‌పేట్‌ పోలీస్‌ స్టేషన్‌ వద్ద నుంచి వచ్చేలా చూడాలని సూచించారు. ఎక్కువ వాహనాలు వస్తే తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు వస్తున్నాయని అభిప్రాయపడ్డారు.
- 20వ తేదీ సాయంత్రం నుంచి 24 గంటలు పనిచేసేందుకు 3 షిఫ్టుల్లో 300 మంది పారిశుధ్య కార్మికులు అందుబాటులో ఉంటారని జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌ తెలిపారు.
- భక్తుల రద్దీ దృష్ట్యా 100 వరకు మొబైల్‌, బస్సు టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. విద్యుత్‌ సమస్యలపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.
- సాయంత్రం 5గంటల నుంచి 10 గంటల వరకు సుదీర్ఘంగా అధికారులు చర్చించారు.

పెద్దమ్మ దేవాలయంలో ముగిసిన శాకంబరి ఉత్సవాలు

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ శ్రీపెద్దమ్మ దేవాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న అమ్మవారి శాకంబరి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయాన్ని, అమ్మవారిని తిలకించేందుకు నగర నలుమూలల నుంచి భక్తులు భారీగా విచ్చేయడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. సోమవారం ముగింపు వేడుకలకు భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతిఏటా ఆషాఢ మాసంలో అమ్మవారి శాకంబరి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. గర్భగుడితో పాటు ప్రాంగణమంతా బెండకాయలు, కాకరకాయలు, సొరకాయలు, పొట్లకాయలు, గుమ్మడికాయలు, క్యాలీఫ్లవర్‌, క్యాబేజీ, దొండకాయలు, వంకాయలు, ఆలుగడ్డ, క్యాప్సికమ్‌, పాలకూర, కొత్తిమీర, క్యారెట్‌, బీట్‌రూట్‌తో పాటు ఆపిల్‌, పైనాపిల్‌, అరటిపండ్లు, వాటర్‌ మిలన్‌, ఖర్బూజ తదితర పండ్లతో అలంకరించారు.

నేడు బోనాల చెక్కుల పంపిణీ

బౌద్ధనగర్‌: సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాలులో మంగళవారం దేవాలయాలకు బోనాల పండుగ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇంచార్జ్‌ ఆదం సంతోష్‌కుమార్‌ తెలిపారు. బౌద్ధనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోనాల పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్‌ నియోజకవర్గం పరిధిలోని 240 దేవాలయాలకు సంబంధించిన చెక్కులను మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారుడు వెం నరేందర్‌ రెడ్డి చెతుల మీదుగా ఆలయ కమిటీల ప్రతినిధులకు అందజేయనున్నట్లు తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో)టమాటా రూ.57, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్‌ 67, పచ్చకాకర 45, పందిరి బీర 28, క్యాబేజీ 38, క్యారెట్‌ 35, దొండ 35, గుండుబీన్స్‌ 70, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 18, బీట్‌రూట్‌ 23, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 39, చామగడ్డ 37, మొరంగడ్డ 43, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 16, అరటికాయ 11, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఇంజనీరింగ్‌ విద్యార్థులకు ఉచిత శిక్షణ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఐదు రోజుల క్యాంపస్‌ ఉచిత రిక్రూట్‌మెంట్‌ ట్రైనింగ్‌ ప్రోగ్రామ్‌ ప్రారంభమైంది. క్యాంపస్‌ ఇంజనీరింగ్‌ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌సీడీసీ, ఇంజనీరింగ్‌ కాలేజీ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్‌ ప్రొ.చంద్రశేఖర్‌, వక్తలు శ్రీనివాస్‌ రెడ్డి, జైదీప్‌, ప్రొ.మురళీధర్‌ రెడ్డి, డా. ఉపేందర్‌ పాల్గొన్నారు.

తార్నాక లేబర్‌ అడ్డా నాయకుడు మహేశ్‌ మృతి



మహేశ్‌ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లాలాపేట: తార్నాక లేబర్‌ అడ్డా నాయకుడు తాపి మేస్త్రీ మహేశ్‌(39) ఆదివారం మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మహేశ్‌ మృతదేహాన్ని సోమవారం తార్నాక లేబర్‌ అడ్డా వద్ద కార్మికుల చివరి చూపు కోసం పెట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు, బిజేపి జల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న మహేశ్‌ మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు.

రేపు క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

పోచారం: క్రిస్టియన్‌ హోలీ మ్యాట్రిమోనీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సికింద్రాబాద్‌ క్లాక్‌ టవర్‌ దగ్గరున్న వైఎంసీఏలో వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నారు. వధూవరులు, వారి కుటుంబ సభ్యులు ఈ వేదికలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 73309 57771 నెంబరుకు ఫోన్‌ చేయవచ్చు.

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే సమస్యలు

కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్‌

కంటోన్మెంట్‌: గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే కంటోన్మెంట్‌లో సమస్యలు పేరుకుపోయాయని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. సోమవారం ఐదోవార్డు కాకాగూడ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాజీ శాసన సభ్యులతో పాటు బోర్డు సభ్యులు విఫలమయ్యారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి కేవలం 40 రోజులే అవుతోందన్నారు. ఏ కాలనీ, బస్తీలో పర్యటించినా స్థానికులు సమస్యలు ఏకరువు పెడుతున్నారని అన్నారు. ఇన్నేళ్లుగా కంటోన్మెంట్‌ను అభివద్ధి చేశామని చెప్పుకుంటున్న వారి పనితనానికి నిదర్శనంగా ఈ సమస్యలు కనబడుతున్నాయని అన్నారు. తాను వాళ్లలా అబద్ధపు హామీలు ఇవ్వలేనని, దశల వారీగా సమస్యల పరిష్కారంపై దష్టిపెడతానన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విధంగా ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణ చేపడతామన్నారు. త్వరలోనే బోర్డు అధికారులు, సిబ్బందితో సమీక్షించి, తగిన ఆదేశాలు ఇస్తామన్నారు.

గంజాయి భరతం పడతాం..

బస్తీలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువ అయ్యాయని, స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే స్థానిక పోలీసు అధికారులను ఫోన్‌లో సంప్రదించి పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో శ్యామల, తిరుమల,రజిని, పద్మ,రేపల్లె వెంకటేశ్వర్లు,మరియు బస్తి మహిళలందరూ పాల్గొన్నారు.

భయపడకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గంప నాగేశ్వర్‌రావు

రసూల్‌పురా: భగవంతుడికే విమర్శలు తప్పలేదని అటువంటిది మనుషులకు విమర్శలు ఎదురైతే భయపడి జీవితంలో ఆగిపోకుండా ముందుకు వెళ్తూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని ప్రముఖ మనస్తత్వవేత్త, స్ఫూర్తిదాయక వక్త గంప నాగేశ్వర్‌ రావు తెలిపారు. ప్రపంచ యువత నైపుణ్యం దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో యువతకు అవగాహన కల్పించారు. యువత తమ నైపుణ్యాలు, దక్షతలు సృష్టించడంలో సహాయపడుతూ సమాజంలో విద్యార్థుల ప్రభావాన్ని అభివృద్ధి చేసే ముఖ్య లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. చోటూకి ఎడ్యుకేషన్‌ వ్యవస్థాపకులు యువనేశ్వరి, నేషనల్‌ స్కిల్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ జాయింట్‌ డైరెక్టర్‌ విజాయనంద్‌, రాష్ట్ర సైబర్‌ క్రైమ్‌సెల్‌ పోలీస్‌ అధికారి ప్రమోద్‌ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థలకు చెందిన 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలంటూ జీఎంకు వినతి



జలమండలి జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బిజేపీ నేతలు

అడ్డగుట్ట: బోనాల పండుగ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండే విధంగా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి హంసరాజు కోరారు. సోమవారం మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను పలువురు బీజేపీ నేతలు ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించి అనంతరం, మాట్లాడారు. డివిజన్‌లో చాలా చోట్ల తాగునీటి, సీవరేజీ పైప్‌లైన్‌ పనుల పనులు పూర్తి అయినప్పటికీ కూడా అందులో నుంచి వెలువడిన మట్టిని అక్కడే వదిలేశారన్నారు. తవ్విన రోడ్డుకు కూడా ప్యాచ్‌ వర్క్‌ పనులు చేయలేదన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు మహేందర్‌, ఉదయ్‌ యాదవ్‌, చిరంజీవి, శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యను పరిష్కరిస్తాం



జీహెచ్‌ఎంసీ అధికారులకు సమస్యలు వివరిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ నియోజకవర్గం పరిధిలో వరదనీటి సమస్యలు తొలగిస్తున్నామని జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు తెలిపారు. మెట్టుగూడ డివిజన్‌ పరిధిలోని మెట్టుగూడ, విజయపురి ప్రాంతాల్లో వరదనీటి ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలను స్థానిక కాంగ్రెస్‌ నాయకులు సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారుల దష్టికి తెచ్చారు, స్పందించిన జీహెచ్‌ఎంసీ ఈఈ ఆశాలత, డీఈ ప్రశాంతి, ఏఈ శశిధర్‌రెడ్డి వరద ఇబ్బందులు తెలెత్తిన ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద ఇబ్బందులు లేకుండా ఉండేందుకు లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం బోనాల పండుగను పురస్కరించుకుని ఆలుగడ్డబావి రెండు కట్టల అమ్మవారి దేవాలయం వద్ద రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు ఆదం సంతోష్‌ కుమార్‌, జలంధర్‌రెడ్డి, రవి, అభిషేక్‌, అబ్దుల్‌ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి బోనాలకు ఏర్పాట్లు



ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న అడవయ్య

సికింద్రాబాద్‌: మెట్టుగూడ డివిజన్‌ దూద్‌బావి అమ్మవారి దేవాలయంలో ఈనెల 21న బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం తార్నాకలోని ర్యాల అడవయ్య చారిటబుల్‌ ట్రస్టు ప్రతినిధులతో ఆలయ నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల కోసం చేస్తున్న బోనాల పండగ ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం అడవయ్య చారిటబుల్‌ ట్రస్టు నుంచి రూ.20 వేలను ట్రస్టు నిర్వాహకుడు ర్యాల రాజేందర్‌ అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వెంకటేశ్‌, శంకర్‌, గౌరయ్య, రవిందర్‌ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: అనారోగ్యంతో ప్రయాణం చేసేందుకు సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్‌ రైల్వే పీఎస్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్‌ బలార్షకు చెందిన రామదాసు (39) కూలీగా పనిచేస్తున్నాడు. అనారోగ్యం కారణంతో కర్నూలు నుంచి బలార్ష వెళ్లేందుకు రైలులో బయలుదేరిన రామదాసు సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. బలార్ష రైలుకు సమయం ఉండడంతో రైల్వేస్టేషన్‌ 2వ నెంబరు ప్లాట్‌ఫామ్‌పై నిద్రపోయి నిద్రలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి వద్ద లభించిన వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: పట్టాలు దాటుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం సికింద్రాబాద్‌ రైల్వే పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మేడ్చల్‌ జిల్లా గౌడవెల్లికి చెందిన కానుగంటి బాబు (33) వృత్తి రీత్యా బార్బర్‌. ఇంటి నుంచి దుకాణానికి వేళ్లే సమయంలో గౌడవెల్లి రైల్వేస్టేషన్‌ వద్ద పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అదేసమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డ బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.